కథా నిలయం
4974
శ్రీకాకుళం

# ప్రమద్వర

ఇద్దరు స్నేహితురాళ్ళతో కలిసి బయలుదేరిన ప్రమద్వర సంపెంగచెట్టు దగ్గర నిలబడింది. రెండు రోజులనాడు చూసిన మొగ్గలు వికసించాయో లేదో అని చూస్తోంది.

మొగ్గలతోఉన్న అక్కడి సంపెంగచెట్టు దగ్గరికి ధైర్యంగా పిల్లలు వెళ్ళరు. చెట్టుదగ్గరలోనే పెద్ద పుట్ట ఉంది.

అపరాహ్ణం దాటిన తరువాత ఆశ్రమం నిశ్శబ్దంగా ఉంటుంది. సమయం చూసుకుని బయలుదేరిన ప్రమద్వర చెట్టునుచూస్తూ నిరాశ చెందింది. ఆ మొగ్గలు ఇంకా పువ్వులు కాలేదు. అయితే, ఆ చెట్టు చిటారుకొమ్మన గుమ గుమ లాడుతూ వికసించిన సంపెంగపువ్వు కనబడటంతో ప్రమద్వర చాలా ఆనందించింది. దాన్ని కొయ్యాలని చూస్తూ, అక్కడున్న ఒక చిన్న కర్రతో కొట్టింది. కొమ్మ కదులుతోంది కానీ పువ్వు రాలి పడదే!

ముఖానికి అప్పుడే చిరుచెమటలు పట్టాయి. తుడుచుకుంటుంటే దగ్గరలో నుంచి నవ్వులు వినిపించాయి. ప్రమద్వర అటూ ఇటూ చూసింది-మళ్ళీ నవ్వు-మళ్ళీ నవ్వు - పకపకా - కిలకిలా - అటూ ఇటూ మళ్ళీ చూసింది.

ఆ రోజు ఆశ్రమంలోని ముత్తైదువలు ప్రమద్వరకు అభ్యంగనస్నానం చేయించి, కురులు ఆరడానికి ధూపం వేశారు. అందమైన నల్లని కురులు జడ అల్లారు. ప్రమద్వర పొడవైన జడని ముందుకు వేసుకుని మళ్ళీ సంపెంగచెట్టు వైపు చూపు సారించింది. చివాల్న భుజానికి ఏదో తగిలింది, నేలమీద వచ్చి పడింది-మరొకటి, మరొకటి - భుజంమీద, మెడమీద, చెంపలమీద ఒకటి ఒకటి పడుతూంటే ప్రమద్వర చిరాగ్గా విదిలించుకుంది. భుజాన్ని దులుపుకొనే లోపల మెడమీద, మెడమీద దులుపుకొనే లోపల చెక్కిలిమీద పడ్డాయి వరుసగా.

అవే నేరేడుపళ్ళు-ఆ పళ్ళు చితికి రసం చిందింది - బుగ్గలపైన, భుజాలపైన, మెడపైన వంగరంగు మచ్చలు కనిపిస్తున్నాయి. అసలే ఎర్రని పెదాలు, పచ్చని చెక్కిళ్ళు వున్న ప్రమద్వరకు ఈ నేరేడుపళ్ళ రంగు మరకలు మరీ

అందాన్నిస్తుంటే స్నేహితురాళ్ళు కూడా నవ్వాపుకోలేకపోయారు. ప్రమద్వరకి ఉక్రోషమొచ్చింది. ఎవరీపని చేస్తున్నారో తెలుసుకోవాలి - ఆశ్రమ బాలకులకు తనని ఏడిపించే ధైర్యం లేదు. తనను పెంచి పెద్దచేసిన స్థూలకేశి మహర్షిఅంటే అందరికీ భయమే. ప్రమద్వర చెలికత్తెలతో త్వరత్వరగా నడుస్తోంది.

చివాల్న నేరేడుచెట్టు దిగి, వేగంగా వచ్చి "కోపం వచ్చిందా?" అన్నాడు ప్రమద్వర చేయిపట్టుకొని దగ్గర ఆశ్రమంలో ఉండే మునికుమారుడు. ఎంతో ఆకర్షణీయంగా ఉన్న అతని ముఖం చూడగానే ప్రమద్వర కోపం కొంతపోయింది కాని, ఈ కొంటెవాడికి ఏ శిక్ష విధించాలో అనుకుంటూ ముందుకు నడిచింది.

ఇంకా కోపంతగ్గని ప్రమద్వరని చూసి "సంపెంగపువ్వు కోసిపెట్టాలా?" - మునికుమారుడు ప్రమద్వర భుజంమీద చేయి వేసి వేగంగా చెట్టువైపు నడిచాడు.

"మీ తండ్రిగారికి చెప్పకూడదు" అంటూ ఎగిరి గంతేసి కొమ్మ వంచి పువ్వుకోసి చేతికిచ్చాడు.

"కోపం పోయిందా?"

"ఊఁ -" ప్రమద్వర పొడవైన జడలో పువ్వును తురుముకుంది.

"చూడు. ఎలా ఉన్నావో! ఆ పచ్చని రంగు, ఈ ఎర్రని రంగు, ఈ ఊదా రంగు, కలసి-త్రివర్ణ సుందరిలా ఉన్నావు" అంటూ ఆమె చెక్కిళ్ళు, పెదాలు, భుజాలు ఒకటొకటీ ముట్టుకుని చూపించాడు.

చెలికత్తెలు, ప్రమద్వర. ముని కుమారుడు నడుస్తున్నారు వేగంగా. "ఈ రంగులు తుడవనీ, మీ తండ్రిగారు ఇవేమిటని అడిగితే?" అంటిన నేరేడు రంగుని తుడుస్తుంటే ప్రమద్వర నవ్వుతూ ఊరుకుంది.

ప్రమద్వర, చెలికత్తెలు ఆశ్రమం చేరారు. చెలికత్తెలు ప్రమతి మహర్షి కుమారుడు చేసిన అల్లరి అంతా పూసగుచ్చినట్టు స్థూలకేశ మహర్షికి నివేదించారు. అంతా విని నవ్వి ఊరుకున్నాడు మహర్షి.

మరునాడు సంపెంగచెట్టు కింద నలుగురూ కూడారు.

'నీ పేరు రురుడా?'

పకపకా నవ్వింది ప్రమద్వర. ఆగకుండా నవ్వింది.

"భృగుమహర్షి మీ ముత్తాతటగా? మా తండ్రిగారు చెప్పారు!" జడ వయ్యారంగా ముందుకు వేసుకుంది ప్రమద్వర.

"అవును. మునికన్య వనుకున్నాను. మేనక, గంధర్వరాజుల కుమార్తె వటగా? మా తండ్రిగారూ చెప్పారు. అంత సుకుమారివని తెలియకే నిన్న నేరేడు పళ్ళు విసిరాను. ఏవీ దెబ్బలు?" రురుడి మాటలకి సిగ్గుతో తలవంచింది ప్రమద్వర.

వారి స్నేహం దిన దిన ప్రవర్ధమానమైంది. యౌవనంతో పాటు ఆ స్నేహం అనురాగంగా మారింది. ఆశ్రమవాసు లందరికీ ముచ్చట గొలిపింది వారి సాహచర్యం.

నూనూగు మీసాల యౌవనంతో, పొందికైన శరీర సౌష్ఠవంతో ఆకర్షణీయంగా తయారయ్యాడు రురుడు. యుక్తవయసుతో బాటు గంధర్వదేవతా స్త్రీల సౌందర్యాన్నీ, సౌకుమార్యాన్నీ రంగరించి పోసిన మెరుపుతీగలా తయారయింది ప్రమద్వర.

తన కిష్టమయిన సంపెంగపూలు కొయ్యాలని మళ్ళీ స్నేహితురాళ్ళతో బయలుదేరింది ప్రమద్వర. ఈ రోజు చెట్టునపూలు విరబూసి ఉన్నాయి. కొంచెం పైకొమ్మనున్న సంపెంగ ముందు ముందుకు వంగి వయ్యారంగా ప్రమద్వరని చూస్తోంది.

'ఈ పువ్వే కావాలి, దాన్నే కొయ్యాలి—రురుడి సహాయం లేకుండా తనే కోయాలి.'

ప్రమద్వర ప్రయాసతో కొమ్మ వంచింది. పూవును అందుకోబోయింది. పాదాలపై ఏదో పడింది. చటుక్కున పాదం విదిలించింది. అంతలోనే కెవ్వున కేకవేసి నేలకూలింది. భయంకరమైన నాగసర్పం జరజరా పాకుతోంది దగ్గరలో ఉన్న పుట్టలోకి. మిలమిలా మెరుస్తోంది. చెలికత్తెలు గజగజా వణికి పోయారు. సర్పం గబగబా పుట్టలో కెళ్ళిపోయింది.

వేగంగా పరిగెత్తి స్థూలకేశ మహర్షికి విన్నవించారు. భరద్వాజ, మైత్రేయ, ఉద్దాలక, శ్వేతకేతు, ప్రమతులంతా అక్కడికి వేగంగా చేరారు. రురుడు పరుగెత్తి వచ్చాడు.

భయంకరమైన విషం ప్రమద్వర ప్రాణాలు బలిగొంది. అసువులుబాసి పడి ఉన్న ప్రమద్వర నిద్రిస్తున్న వనదేవతలా ఉంది రురుడి కళ్ళకి. మృత దేహంమీద పడి రోదించాడు రురుడు. అచేతనుడయ్యాడు. అక్కడున్న మహర్షు లందరూ కన్నీరు నించారు. రురుడి శోకానికి అవధుల్లేవు. తన ప్రేయసిని ఎలాగైనా బతికించమని పేరు పేరునా అందర్నీ వేడుకున్నాడు.

సృష్టికి ప్రతిసృష్టి చేయగల మహర్షులు, తపోధనులు ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు నిస్సహాయతతో. ఇక అక్కడ నిలవలేక దుఃఖిస్తూ ఒంటరిగా అడవిలో ప్రవేశించాడు రురుడు. ప్రమద్వర లేని జీవితం తనకొద్దు. అడవి అంతా సంచరించాడు రురుడు. చెట్టునూ, పుట్టనూ ప్రార్థించాడు.

"నేనే కనక యజ్ఞ యాగాది సత్కర్మలు ఆచరించేవాడినయితే, నేనే కనక వేదాధ్యయన దీక్షాపరతంత్రుడినయితే, నా ప్రేయసిని, నా ప్రమద్వరని బ్రతికించండి, నన్ను దయతలచండి" అంటూ దేవతలందరినీ కన్నీరు మున్నీరుగా వేడుకున్నాడు. "ఏ మంత్రతంత్రాలతోనైనా ఆ విషాన్ని పోగొట్టలేరా" అని అడుగుతూ రురుడు శోకమూర్తియై అడవి అంతా దీనంగా తిరుగాడాడు. "ఎవరైనా ఈమెను బతికిస్తే నా తపఃఫలాన్ని, నా అధ్యయనఫలాన్ని దాన మిచ్చేస్తాను" అంటూ వాగ్దానం చేశాడు.

చివరకు రురుడి ప్రార్థన ఫలించింది.

"విధిని ఎదిరించటం ఎవరికీ సాధ్యంకాదు. కానీ, ఒక్క మార్గముంది."

మధురమైన వాక్కు ఆశాజనకంగా వినిపించింది రురుడికి. ఆశతో, ఆశ్చర్యంతో ఆకాశంవంక చూశాడు.

"ప్రమద్వరకి నీ ఆయుస్సులో సగం పంచి ఇస్తావా? అప్పుడే ఆమె బతుకుతుంది"—ఆకాశంనుంచి వెలువడిన దేవదూత వాక్కు రురుణ్ణి బాధ నుంచీ, దుఃఖంనుంచీ విముక్తుణ్ణి చేసింది.

"ప్రమద్వర జీవించటానికి ఏమైనా చేస్తాను." సద్భక్తితో, వినయంగా చేతులు జోడించి దేవదూతవాక్కు వినపడినవైపు చూశాడు. సత్యపరుడూ, ప్రేమ మూర్తీ అయిన రురుడి ప్రమాణవాక్యం బ్రహ్మదేవుడు అంగీకరించినట్లు ఆకాశం కొత్త వెలుగుల్ని నింపుకుంది.

ప్రమద్వర రురుని ఆయుర్భాగ్యం పంచుకుని ప్రాణం నిలుపుకుంది.

ప్రమద్వర రురుల వివాహ మహోత్సవాన్ని కనులవిందుగా వీక్షించారు ఆశ్రమవాసులంతా. ఆ వనమంతా కల్యాణవేదికై భాసించింది.

''నాథా! ఆయుర్భాగ్యాన్ని పంచి యిచ్చిన నా ప్రేమమూర్తీ, ప్రేమ నిత్యమని, ప్రేమ సత్యమని, లోకానికి చాటడానికే మీరు ఉద్భవించారా?'' ప్రమద్వర కృతజ్ఞతాపూర్వకంగా భర్తకేసి చూసింది.

''నా దీర్ఘాయుష్షు మనిద్దరిదీ. మనిద్దరి అర్ధాయుష్షు కలిసీ పూర్ణాయుష్షే కదా! అయినా నీవు ఉంటేనే నేనుంటాను. తెలుసా నీకు?'' అన్నాడు రురుడు ప్రేమ దృక్కులను ప్రసరిస్తూ. అవధులు లేని భర్త ప్రేమానురాగాలు తల్చుకుంటూ భర్తగాఢపరిష్వంగంలో పరవశించింది ప్రమద్వర. *

(ఆధారం : కవిత్రయంవారి శ్రీమదాంధ్ర మహాభారతం
ఆదిపర్వం : ప్రథమాశ్వాసం)

(ప్రచురణ : ఆంధ్రప్రభ సచిత్రవార పత్రిక : 29-7-1987)